## 10హెచ్‌పీ మోటర్లతో ఇబ్బందులు..

జనగామ రూరల్, నవంబర్ 28 : 10హెచ్‌పీ మోటర్లు వాడితే ఇద్దరు రైతులకు ఒక ట్రాన్స్‌ఫారం వాడాలి. అప్పుడు ఖర్చు ఎక్కువ అవుతుంది. రైతులు కూడా 10హెచ్‌పీ మోటర్ కొనుగోలు చేస్తే వాటి విలువ లక్షల్లో ఉంటుంది. రైతు అంత ఖర్చు చేయలేడు. 10ఎకరాలు ఉన్న రైతు 3గంటల కరెంట్‌తో ఎట్లా వ్యవసాయం చేస్తడు. 10హెచ్‌పీ మోటర్లు వాడితే యాసంగి పంటకు నీళ్లు దొరుకుతయా..? భూగర్భజలాలు అడుగంటి కనీసం తాగడానికి కూడా నీళ్లు దొరకవు. కర్మకాలి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 3గంటల కరెంట్ ఇస్తే రైతులంతా వ్యవసాయం బంద్ పెట్టాల్సిందే. గత పదేళ్లుగా సీఎం కేసీఆర్ పాలనలో రైతులంతా సంతోషంగా ఉన్నారు.



***- తేల్జారీ ఉప్పలయ్య, రైతు, కాళోజీ చౌరస్తా, శామీర్‌పేట, జనగామ మండలం***

## గతంలో భూ రికార్డులు తప్పుల తడక..



బచ్చన్నపేట, నవంబర్ 28 : ఆంధ్రోళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థతో ఎన్నో ఇబ్బందులు పడ్డం. వాళ్ల పాలనలో భూ రికార్డులు తప్పుల తడకగా ఉండేవి. ఆఫీసుల చుట్టూ తిరిగినా పనులు కాలేదు. మా భూమి మాకు పట్టా చెయ్యమంటే లంచాలు ఇచ్చేది. అయినా ఏళ్లు తిరగాల్సి వచ్చేది. భూ ప్రక్షాళన చేసిన సీఎం కేసీఆర్ రైతు బాగుకోసం ధరణి పోర్టల్ తెచ్చిండు. ఎవరి భూమి వారికి చేసిండు. పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చిండు. అప్పటి నుంచి పంచాయతీలు లేవు. రైతు వేలుముద్ర వేస్తేనే భూమి ఇతరులకు మారేలా టెక్నాలజీ తెచ్చిండు. ఇంత చేసిన కేసీఆర్‌ను కాదని.. మళ్లీ పాత పద్ధతి తెస్తాం. కాంగ్రెస్‌ను గెలిపించండి అంటూ వాళ్ల పార్టీలో ఊళ్లల్లో తిరుగుతున్నరు. మన బాగుకోసం కష్టపడుతున్న కేసీఆర్‌కు అండగా నిలుద్దాం.

***- చీర భిక్షపతి, రామచంద్రాపూర్, బచ్చన్నపేట మండలం***





తొర్రూరు రోడ్‌షోకు భారీగా హాజరైన జనసందోహం

# దయన్నే మీ ధైర్యం..

- పాలకుర్తి ప్రజలకు తలవంపులు తేకుండా పని చేశా
- 30న ఓటుతో దుమ్ము లేపాలి.. కారు గెలువాలి
- కాంగ్రెస్‌ను నమ్మొద్దు
- ఊరికి వంద మందికి ఉద్యోగాలు ఇప్పించేలా భవిష్యత్ కార్యాచరణ
- తొర్రూరు రోడ్‌షోలో మంత్రి దయాకర్‌రావు
- ప్రచార అంకం ముగింపు ర్యాలీకి పోటెత్తిన గులాబీ దండు



మంత్రి దయాకర్‌రావును భారీ గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

తొర్రూరు, నవంబర్ 28 : ''దయన్నే మీ ధైర్యం... కష్టం వచ్చిందంటే క్షణంలో వాలుతా... నా 40ఏళ్ల రాజకీయ జీవితంలో నన్ను నమ్మి గెలిపించిన ప్రజలకు తలవంపులు తేకుండా పని చేశా''..అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా తొర్రూరులో మంగళవారం ఆయన భారీ రోడ్డు షో నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో రోడ్డు షో విజయవంతమైంది. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కళ్ల ముందు కన్పిస్తున్న అభివృద్ధి, ఇంటింటా అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ప్రతి ఒక్కరూ దయన్నను మరిచిపోతారా..? అంటూ వేలాదిగా పోటెత్తిన గులాబీ దండును ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా వేల గొంతుకలు కారుకు ఓటేస్తాం... దయన్నను గెలిపిస్తామంటూ పెద్ద ఎత్తున నినదించారు. మూడుసార్లు తనను ఆదరించి గెలిపించిన పాలకుర్తి ప్రజలకు రుణపడి ఉన్నానన్నారు. ఈ ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక వ్యవసాయానికి పెట్టుబడి లేక, ఎరువులు లేక, మోటర్లు, స్టార్లర్లు కాలుతుండడంతో పైసలు లేక, గొంతు తడుపుకోవడానికి ఇంటింటికీ నీళ్లు లేక గోసపడింది మీరుకాదా..? అని అన్నారు. అలాంటి పార్టీకి మళ్లీ ఎందుకు అవకాశం ఇవ్వాలని ప్రశ్నించారు. రైతులు, కూలీలు బాగుంటే వ్యాపారులు బాగుంటారన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. బంధు, రైతు బీమా, పంటలకు కడుపు నిండా కాల్వలు, చెరువుల ద్వారా నీళ్లు అందించారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ఎస్సారెస్పీ కాల్వలు తవ్విస్తే బాబ్లీపై తాను పోరాటం చేసి పోలీస్ కేసుల పాలైనా పదేళ్ల కాంగ్రెస్ హయాంలో చుక్క నీళ్లు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి కాల్వలు, చెరువుల్లో పుష్కలంగా నీటిని నింపుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంటే ఉంటుందని, కేసీఆర్ వస్తే 24గంటల కరెంట్ కొనసాగుతుందన్నారు. దొంగ రేవంత్‌రెడ్డికి కనీస అవగాహన లేక 10హెచ్‌పీ మోటర్లు పెడితే వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని పదే పదే చెబుతున్నారని, ఆ పార్టీని గెలిపిస్తే మళ్లీ చీకటి రోజులు తప్పవని హెచ్చరించారు. గిరిజన తండాలు, గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించామన్నారు. తొర్రూరును రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీగా తీర్చిదిద్ది రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగా ప్రతి వార్డులో రూ.1.50కోట్ల విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు. తొర్రూరులో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేశామని, పనులు ప్రారంభించే ముందే ఎన్నికల కోడ్ వచ్చిందని తెలిపారు. నియోజకవర్గంలో పదివేల ఇండ్లు ఇస్తానని తన విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, అప్పు చేసి ఇళ్లు కట్టుకున్న వారికి కూడా రూ.5లక్షలు ఇప్పిస్తానన్నారు. ఊరికి 100మంది యువతకు ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పించేలా, ప్రభుత్వ కొలువులు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇప్పించేలా భవిష్యత్ ప్రణాళిక రూపొందించామన్నారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలందరికీ వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉండడమే నాకు ఎంజాయ్ అని చెబుతూ ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కరోనా కష్టకాలంలో, లైసెన్స్‌ల జారీ, నిరుద్యోగ యువతకు శిక్షణ, కుట్టుశిక్షణ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన తీరును వివరించారు. మీ కళ్ల ముందు కనిపిస్తున్న ఈ అభివృద్ధిని చూసి తనను గెలిపించాలని కోరారు.

### దుమ్ము లేపాలి.. కారు గెలువాలి..

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించి ఈ నెల 30న ఓట్ల రూపంలో దుమ్ములేపి కారును గెలిపించాలని దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 75వేల కోతులను పట్టించి సురక్షితంగా అడవులకు తరలించామని, రానున్న ఐదేళ్లలో ఏ గ్రామంలో కోతుల బాధ లేకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే క్రమంగా రైతు బంధును రూ.16వేలకు, పెన్షన్‌ను రూ.5వేలకు పెంచుతుందని, నిరుపేద మహిళలకు నెలకు రూ.3వేల భృతి, రూ.400లకే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల వ్యక్తిగత బీమా అందిస్తుందని తెలిపారు. తాను గెలిచిన ఆరు నెలల్లో దళిత, బీసీ, గిరిజన బంధును అర్హులైన వారందరికీ ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు.

### బీఆర్‌ఎస్‌తోనే ఆరోగ్య రక్ష

**ఆరోగ్యశ్రీ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు**

బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ పరిధిలో ప్రస్తుతం రూ.5లక్షలు ఉన్న సేవలను రూ.15లక్షలకు పెంచబోతుందని తెలిపారు. దయాకర్‌రావు కారణంగానే ఈ రోజు పాలకుర్తి నియోజకవర్గానికి పుష్కలంగా సాగునీరు వస్తోందని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉష మాట్లాడుతూ నిత్యం జనం మధ్య ఉండే దయాకర్‌రావు కుటుంబ సభ్యులతో కూడా గడపరని, ఆయనకు అభివృద్ధి అంటే, ప్రజల కష్టసుఖాల్లో పాల్గొనడం ఎంతో ఇష్టమని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చే డబ్బులు ముఖ్యమా..? దయన్న చేసే అభివృద్ధి ముఖ్యమా..? ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. దయన్న వంటి మంచి వ్యక్తి గెలిస్తే ప్రతి ఇల్లు, ప్రతి ఊరు ఎంతో బాగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మండల ప్రధాన నాయకులు ఎల్ వెంకటనారాయణగౌడ్, డాక్టర్ పీ సోమేశ్వర్‌రావు, రామసహాయం కిశోర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, వైస్‌చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డితోపాటు కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



రాయపర్తిలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## ప్రజల ఆకాంక్షను గౌరవించని కాంగ్రెస్

- ఆదర్శ నియోజకవర్గం కోసం అహర్నిశలు కృషి
- రాయపర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, నవంబర్ 28 : సుదీర్ఘ కాలం పాటు సాగిన తెలంగాణ ఉద్యమంలో నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఏనాడూ గౌరవించని జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో సచ్చిన శవంతో సమానంగా మారిందని బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమంలో అవలంబించిన విధానాలతోనే సుమారు 1200 మంది బిడ్డలు ఆత్మబలిదానాలకు పాల్పడ్డారని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ సిద్ధాంతాలు, కట్టుబాట్లకు విలువ ఇవ్వకుండా టికెట్లు అమ్ముకున్నాడని అన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.

### ఆదర్శ నియోజకవర్గం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నా..

సీఎం కేసీఆర్ సంపూర్ణ సహకారంతో రాష్ట్రంలోనే పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా రూపొందించేందుకు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. వేలకోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, రహదారులు, పల్లె ప్రగతి పనులతో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. పాలకుర్తి నియోజక వర్గంలోని చారిత్రక ఆలయాలు అయిన పాలకుర్తి శ్రీ సోమనాథ ఆలయం, బమ్మెర శ్రీ పోతన ఆడిటోరియం, వల్మిడిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, సేవాలాల్ మహరాజ్ ఆలయం, పాలకుర్తి నియోజక వర్గ కేంద్రంలో తెలంగాణ హరిత కాకతీయ హోటల్ ఏర్పాటు, రాయపర్తి మండలంలోని సన్నూరు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలను మంజూరు చేయించినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 5000 పైచిలుకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కట్టించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల నాయకుడు గుడిపూడి గోపాల్‌రావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్ల సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఆకుల సురేందర్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల నాయకులు పూస మధు, గారె నర్సయ్య, అయిత రాంచందర్, కాంచనపల్లి వనజారాణి, భూక్యా క్రాంతి, నర్మద పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక..

మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణల సారథ్యంలో గ్రామానికి చెందిన కనుకుంట్ల వెంకటయ్య, కొండ సంతోష్‌కుమార్, రమేశ్, కొండేటి సాయిలు, నాగయ్య, నాయిని రమేశ్, కొలిపాక శ్రీను, బలగం భిక్షంలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి ఎర్రబెల్లి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు.

## భారీగా మద్యం పట్టివేత

రాయపర్తి, నవంబర్ 28 : మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి చెక్‌పోస్ట్ వద్ద అధికారులు భారీగా మద్యం తరలిస్తున్న లారీని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు ఓ డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న రూ.8లక్షల విలువైన మద్యం బాటిళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. తొర్రూరు అబ్కారీ పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.



మంత్రి ఎర్రబెల్లికి మద్దతు తెలుపుతున్న పద్మశాలీలు

## మంత్రి ఎర్రబెల్లికి పద్మశాలీల సంపూర్ణ మద్దతు

రాయపర్తి, నవంబర్ 28 : ఈ నెల 30న జరుగనున్న ఎన్నికలలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు తమ మద్దతు ఇస్తున్నట్లు మండల పద్మశాలీల సంఘం ప్రకటించింది. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని పద్మశాలీ కులస్తులు పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లిని కలిసి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మండల పద్మశాలీల సంఘం ప్రతినిధులు అంకం నర్సయ్య, కొంగ భిక్షపతి, గజవెల్లి ప్రసాద్, కొంగ నర్సయ్య, వడిచర్ల శ్రీనివాస్, మండల ఎల్లయ్య, ప్రభాకర్, గుమ్మడవెల్లి శ్రీనివాస్, వేముల రమేశ్ పాల్గొన్నారు.